క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు వరుణ్ ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వరుణ్

రౌతులపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కె.వరుణ్ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ ఎస్వీ నాయుడు శనివారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 304 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులకు గాను వివిధ విభాగాలకు చెందిన 20 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. రొయ్యల చెరువుల్లో రొయ్యలకు సులవుగా ఆహారం వేసేందుకు వరుణ్ తయారు 'స్మార్ట్ ప్రాన్స్ ఫీడర్' పరికరం రాష్ట్రస్థాయికి ఎంపికై ందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థి వరుణ్‌ను పాఠశాల హెచ్ఎం గాడి కొండబాబు, ఉపాధ్యాయులు పి.అచ్చిరాజు, కేవీ వరహాలు, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఎంపీపీ రాజ్యలక్ష్మి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు తదితరులు అభినందించారు.

కుట్టు మెషీన్ల పంపిణీ


మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమణ

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరులో మహిళలకు పాస్టర్ కె.రాజబాబు ఆధ్వర్యంలో శనివారం కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రార్థన మందిరంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు లంక కృపానందం 12 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు అందజేశారు. కాకినాడకు చెందిన ఫ్రెండ్స్ ప్రమోషన్ చారిటబుల్ ట్రస్ట్ (ఎఫ్‌పీసీటీ) అధినేత డాక్టర్ ఐజాక్ బెనర్జి సౌజన్యంతో మహిళలకు ఆరు నెలలు పాటు శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టు మెషీన్ల సమకూర్చినట్టు పాస్టర్ రాజబాబు తెలిపారు.

ఇంటి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్


కేఏ అగ్రహారంలో ఇంటిపన్ను వసూలు చేస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, అధికారులు

కోటనందూరు: గ్రామాల్లో 100 శాతం ఇంటి పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కేఏ అగ్రహారం, కేఏ మల్లవరంలో ఇంటిపన్నుల వసూలును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరుకు కొత్త, పాత పన్ను బకాయిలు 100 శాతం వసూలు చేసేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇంటిపన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటిపన్ను బకాయిదారులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. పంచాయతీ కార్యదర్శులు చైతన్యవృద్ధి, పంపన జయలక్ష్మి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీడీపీఓగా పద్మావతి



శంఖవరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా పద్మావతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె సామర్లకోట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇంచార్జ్‌గా సీడీపీఓగా బాధ్యతలు చేపట్టిన అరుణశ్రీ ఆమెకు స్వాగతం పలికారు. విధి నిర్వహణలో బాధ్యతగా పని చేయాలని ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

ఆర్ఎంపీ బెన్నబాబుకు డాక్టరేట్


న్యూఢిల్లీలో డాక్టరేట్ స్వీకరిస్తున్న ఆర్ఎంపీ బెన్నబాబు

అన్నవరం: స్థానిక రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీసనర్ (ఆర్ఎంపీ), రాష్ట్ర బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పదిలం బెన్నబాబుకు డాక్టరేట్ లభించింది. న్యూఢిల్లీలోని మ్యాజిక్ అండ్ ఆర్ట్స్ యూనివర్సిటీ మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తరఫున బెన్నబాబును గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. పేదలకు వైద్యసేవలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను తనకు ఈ అవార్డు దక్కినట్టు ఆయన తెలిపారు. ఆర్ఎంపీ బెన్నబాబును పలువురు అభినందించారు.


ఏలేశ్వరంలో నీట మునిగిన రహదారి


తుని జీఎన్‌టీ రోడ్డులో కురుస్తున్న వర్షం


తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో మూతపడిన ఇటుక బట్టీ

జోరు వాన

అల్పపీడనం ప్రభావంతో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం తోట పంటలకు మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అకాల వర్షాలపై రైతుల ఆందోళన


జగ్గంపేటలో బ్రిడ్జికి దిగువన నీట మునిగిన రహదారి

తుని: వేసవి తాపంలో అల్లాడుతున్న పట్టణ ప్రజలు శనివారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. పట్టణంలో ఉదయం, సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. వేడి గాలులతో ఇబ్బంది పడుతున్న జనం చల్లటి వాతావరణాన్ని ఆస్వాదించారు. పట్టణ పరిధిలోని రోడ్లు నీటితో నిండిపోయాయి. కాలువల్లో నీటి ప్రవాహం పరుగులు తీసింది. వాతావరణ ఒక్కసారిగా చల్లబడడంతో పెద్దల నుంచి పిల్లల వరకు ఆనందం వ్యక్తం చేశారు. మామిడి, జీడిమామిడి తోటలకు ఈ వర్షంతో మేలు జరుగుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

మూతపడిన ఇటుకల బట్టీలు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలవ్యాప్తంగా శనివారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గోపాలపట్నం, తొండంగి, ఎ.కొత్తపల్లి, పైడికొండ, కృష్ణాపురం, రావికంపాడు తదితర ప్రాంతాల్లో ఇటుకల బట్టీలు మూతపడ్డాయి. ఈదురు గాలుల ప్రభావానికి మెట్ట ప్రాంతాల్లో మామిడి తోటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. పల్లపు వీధుల్లో రోడ్లపై నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

ఏలేశ్వరం: తుపాను ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా శనివారం విస్తారంగా వర్షాలు పడ్డాయి. పలు గ్రామాల్లో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం కురిసింది. రహదారులపై నీరు నిలిచిపోయింది. పట్టణంలోని పలు కాలనీల్లో రహదారులు నీటమునిగాయి. పిడుగులు పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కిర్లంపూడి: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. కిర్లంపూడి ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైన్లు ఏరులై పారాయి. అకాల వర్షంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

గోకవరంలో భారీ వర్షం

గోకవరం: మండలవ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. రబీలో వరి సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోపక్క మామిడి, జీడిమామిడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జగ్గంపేట: మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జగ్గంపేట బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు నీట మునిగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్లుపై మురికి నీరు ప్రవహించడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు


పంచామృత కలశాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శనివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తిరునక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు 108 కలశాల్లో పంచామృతాభిషేకాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాలను అభిషేకించారు. తొలుత కలశాలతో అర్చకులు ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇంటర్ పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు

ప్రత్తిపాడు: స్థానిక హర్షవర్ధన జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిషు పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ కేంద్రంలో 334 మంది పరీక్షలకు హాజరుకావల్సి ఉండగా 327 మంది హాజరైనట్టు అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ ఆనందకుమార్ జోషి తెలిపారు.

రెండేళ్ల పాలనలో అభివృద్ధికి పెద్దపీట

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుధారాణి


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

తుని: తమ రెండేళ్ల పాలనలో పట్టణంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 39 అంశాలను చర్చించి ఆమోదించారు. వైఎస్సార్ సీపీ తరఫున మున్సిపల్ ఎన్నికల్లో 30 స్థానాలనూ కైవసం చేసుకొని కొలువుతీరిన పాలకవర్గం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చైర్‌పర్సన్ సుధారాణి, కౌన్సిలర్లు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. గడిచిన రెండేళ్లలో సాధించిన విజయాలు, అభివృద్ధి, పాలకవర్గం పనితీరు సంతృప్తిని ఇచ్చిందన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సారథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దాడిశెట్టి రాజా విజయం కోసం కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

రూ.15 కోట్లతో అభివృద్ధి

పురపాలక సంఘం పాలకవర్గం ఏర్పడిన రెండేళ్లలో రూ.15 కోట్లు అభివృద్ధి జరిగిందని చైర్‌పర్సన్ సుధారాణి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ మంత్రి రాజా చొరవతో ప్రజల సమస్యలను పరిష్కరించామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను తెలియజేశారు. తమ వార్డుల్లో అభివృద్ధికి సహకరించిన చైర్‌పర్సన్ సుధారాణి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యలను వంద శాతం పరిష్కరించినట్టు కో ఆప్షన్ సభ్యుడు బాలు తెలిపారు. పట్టణంలో రూ.7 కోట్లతో సీసీ రోడ్లు, రూ.2 కోట్లతో కాలువల నిర్మాణం, రూ.5 కోట్లతో నాడు-నేడులో పాఠశాలల అభివృద్ధి, రూ.కోటితో పార్కుల నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. వచ్చే మూడేళ్లగా ప్రజలు మెచ్చిన రీతిలో పాలన అందించేందుకు కౌన్సిలర్లు, అధికారులు సహకరించాలని చైర్‌పర్సన్ సుధారాణి కోరారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, డీఈఈ ప్రకాశరావు, రెవెన్యూ అధికారి సాల్మన్‌రాజు, టీపీఎస్ ప్రవీణ్‌కుమార్, ఇతర శాఖలకు చెందిన అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


సీతారాములను దర్శించుకుంటున్న పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ గంగాభవానీ

తుని రూరల్: అటికెవానిపాలెంలో పునర్నిర్మించిన రామాలయంలో సీతారాములు, వినాయక, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 8.49 గంటలకు సీతారాములు, 10.18 గంటలకు వినాయక, సాయిబాబా విగ్రహాలను అర్చకులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, దాడిశెట్టి విష్ణుచక్రం, మాజీ సర్పంచులు అత్తి వెంకటరమణ, బెక్కం సూరిబాబు, ఉపసర్పంచ్ అటికె వీర్రాజు, గోసుల కృష్ణ సీతారాములను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు బిర్రా జోగినాథం, గోవింద్, బెక్కం శ్రీనివాస్, అటికె బాపన్న, బిర్రా వీరగణేశ్వరరావు తదితరులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా అరుణాచలం


అరుణాచలేశ్వర స్వామికి పూజలు చేస్తున్న కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీ

ప్రత్తిపాడు రూరల్: ఆంధ్రా అరుణాచలంగా పేరొందిన మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి క్షేత్రం అనతికాలంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ అన్నారు. మండలంలోని రాచపల్లి శ్రీరమణా సేవాశ్రమ ప్రాంగాణంలోని అరుణాచలేశ్వరస్వామి క్షేత్రాన్ని శనివారం రాత్రి ఆయన సందర్శించారు. శ్రీరమణా సేవాశ్రమం పీఠాధిపతి రామానంద స్వామీజీతో కలిసి అరుణాచల క్షేత్రంలో నందీశ్వరుడు, అరుణాచలేశ్వరస్వామి, అపీత కుచాంబలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. అరుణాచలక్షేత్రం విశిష్టతలను భక్తులకు వివరించారు. శ్రీరమణాసేవాశ్రమం ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సత్య నాగేశ్వరరావు

తుని రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు సూచించారు. మండలంలోని ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో మండల కోఆర్డినేటర్ సకురు నాగేంద్ర నెహ్రూ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సత్యనాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన సంక్షేమ కిట్లను అన్ని కుటుంబాలకు అందజేయాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న గెడ్లబీడు వద్ద సాయి వేదికలో 30 మంది వైద్యులతో నిర్వహించే ఉచిత మెగా వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆదేరోజు రక్తదానం, అవయవదానం శిబిరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, నాయకులు వంగలపూడి కాంతారావు, కీర్తి రాఘవ, వంగలపూడి గోవిందుబాబు, గంటా చక్రరావు పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ


ఏలేశ్వరంలో తెలుగు క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్లను శనివారం వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు క్యాలెండర్ల ఆవిష్కరణ ద్వారా పండగలపై అవగాహన ఉంటుందన్నారు. ఈ రోజువారి పనులపై ప్రతిఒక్కరికీ ఈ క్యాలెండర్లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వాగు బలరామ్, యండగండి నాగబాబు, పార్టీ నాయకులు దేగల వెంకటరమణ, మసిరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగ్గంపేట: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ శనివారం తెలిపారు. మండలంలోని మల్లిశాల గ్రామానికి చెందిన బర్గా దుర్గాప్రసాద్ (31) గత కొంత కాలంగా ఉబ్బసం, కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఈ నెల 16న కడుపు నొప్పి తాళలేక ఇంటి వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో పేదలకు మెరుగైన వైద్యం


నీలాద్రిరావుపేటలో గర్భిణికి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సౌమ్య

గండేపల్లి: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో పేదులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని గండేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.సౌమ్య అన్నారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ (ఫిజిషియన్) కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

వ్యవసాయానికి ఉపాధి హామీని అనుసంధానం చేయాలి

ప్రత్తిపాడు: వ్యవసాయ రంగానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని అఖిల భారత గ్రామీణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (ఆయర్లా) డిమాండ్ చేసింది. ప్రత్తిపాడులోని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయర్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యుడు బుగత బంగార్రాజు మాట్లాడుతూ కూలీలకు వంద రోజుల పని కల్పిస్తామని చెప్పిన సర్కారు చేసిన పనికి సైతం వేతనాలు చెల్లించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయడానికి కుటిల ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు ప్రధాని మోదీ సర్కార్ అవలంబిస్తున్న గ్రామీణ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చొప్పున వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయర్లా జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, మానుకొండ లచ్చబాబు, జిల్లా కమిటీ సభ్యులు సామిరెడ్డి నారాయణమూర్తి, రత్నకుమారి, రాజాల రత్నం, జక్కంపూడి రాజు, పేరూరు లక్ష్మి, అఖిల భారత గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఏలేశ్వరం: ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన 2021-22 ఏడాదికి గాను ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జాబ్‌కార్డులు ఉన్నా ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. రైతులకు ప్రయోజనకరంగా ఉండే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనులను పారదర్శకంగా చేయాలన్నారు. పనుల్లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామాల వారీగా ఉపాధి పనులపై తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ భానుప్రకాశ్, జిల్లా అంబుడ్స్‌మెన్ కమిటీ సభ్యురాలు జ్యోతి, ఎంపీడీఓ కేవీ సూర్యనారాయణ, ఏపీఓ ఏవీవీ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని గోనేడ, పాలెం, సింహాద్రిపురం గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సభలు నిర్వహించారు. 2021-2022 సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు.

21న ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

తొండంగి: గ్రామాల్లో 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఈ నెల 21న మండలస్థాయి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పసుపులేటి సతీష్ శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా 13వ విడతలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ, ఫారెస్ట్ శాఖలకు సంబంధించి 10.69 కోట్లు విలువైన పనులు చేశారన్నారు. ఇప్పటికే దీనిపై క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఆడిట్‌బృందం సామాజిక తనిఖీ నిర్వహించగా 21న మండల స్థాయిలో తనిఖీ జరుగుతుందన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు జరిగే ఈ తనిఖీలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి

శంఖవరం: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో చేపట్టిన రీసర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం సర్వేయర్లకు సూచించారు. మండలంలోని కత్తిపూడి సచివాలయంలో సర్వే రికార్డులను శనివారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఇప్పటివరకూ జరిగిన రీసర్వే పనులపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిగ్రామంలోనూ అధికారులు పర్యటించి ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు సర్వే చేపట్టాలన్నారు. సుమారు వంద ఏళ్ల తరువాత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ సర్వేతో గ్రామాల్లో దీర్ఘకాలిక భూ సమస్యలు తొలగిపోతాయన్నారు. రైతులు సర్వేకు సహకరించాలని కోరారు. వీఆర్వో శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రం తనిఖీ

గండేపల్లి: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని డీఎల్‌పీఓ ఎం.బాలామణి సూచించారు. జెడ్.రాగంపేటలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్మీ కంపోస్ట్ తయారీపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ఇక్కడ తయారు చేసిన ఎరువులను రైతులకు తక్కువ ధరలకు విక్రయించాలని సూచించారు. నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్, పంచాయతీ కార్యదర్శులు పోతుల వీర శిరీష్, ఎ.తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గోకవరం: మామిడి, జీడిమామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కోరుకొండ ఉద్యానవనశాఖ అధికారి పి.రిణి అన్నారు. మండలంలోని మామిడి, జీడి మామిడి తోటలను శనివారం ఆమె పరిశీలించారు. ఆయా తోటల్లో వచ్చే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై శనివారం గండేపల్లి సమీపంలోని రాయిచెరువు వద్ద జరిగిన ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఏలేశ్వరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మహేష్ మోటార్ సైకిల్‌పై ఇంటర్వ్యూ నిమిత్తం రాజమహేంద్రవరం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని గండేపల్లి రాయిచెరువు వద్దకు వచ్చే సరికి తాను నడుపుతున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో తలకు గాయమైంది. అక్కడే పనిచేస్తున్న హైవే సిబ్బంది ప్రథమ చికిత్స చేసి హైవే వాహనంపై గండేపల్లి పీహెచ్‌సీకి తరలించారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

శంఖవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు ఎంపీపీ పర్వత రాజబాబు సూచించారు. మండలంలోని కొంతంగి కొత్తూరులో జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూడల రామస్వామి, ఎంపీటీసీ నడిగట్ల నానాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బర్ర లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణానికి నిధులు

గోకవరం: మండలంలోని పెంటపల్లిలో బీసీ కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదేశాలతో మండల పరిషత్ నిధులు మంజూరు చేసినట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి తెలిపారు. పెంటపల్లిలో బీసీ కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణ పనులను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. కమ్యూనిటీ భవనానికి రూ.2 లక్షలు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, తొట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.